(మూస కథల విసుగునుంచి చిన్న విరామ యత్నంగా ఈ కథ)

# పాఠం!

—ఇచ్ఛాపురపు రామచంద్రం



"ఓ వివేకమూ, ఓ మూర్ఖత్వమూ కలిపి చేసే సహజీవనానికే దాంపత్యం అని ముద్దు పేరు." అంటారొక రచయిత. అది చాలా నిజమే కానీ—

"...అటువంటి సంసారంలో ఎప్పుడూ మూర్ఖత్వానిదే పైచేయి ఔతుం"దని కూడా అనుంటే — ఒక చిన్న వాక్యంలో ఎంతటి సత్యం ప్రతిబింబిస్తూందా అని నే నెంతో మురిసిపోయేవాడిని.

వివేకం ఎవరిది? మూర్ఖత్వం ఎవరిది? అనేది చెప్పబడలేదు కనుక అటు పాఠక సోదరులూ, ఇటు పాఠక సోదరీమణులూ కూడా ఆ రచయిత మీదా ఈ రచయితమీదా దండెత్తవలసిన అగత్యం ఎంత మాత్రమూ కలగదు.

మూర్ఖత్వానికిలాగే వివేకానికీ స్త్రీ పురుష విచక్షణ వుండదు. విచక్షణ కాకపోతే పక్షపాతం.

వివేకంలాగే మూర్ఖత్వమూ ఏ ఒక్కరి సొత్తూ కాదు.

మనిషంటే — స్త్రీ. మనిషంటే — పురుషుడూను. అలాగే — వివేకమంటే స్త్రీ అన్నా కావొచ్చు, పురుషుడన్నా కావొచ్చు. డిటో మూర్ఖత్వం ఈ సిద్ధాంతం లేదా విశ్వాసం ఈ దిగువ సంభాషణలకి వర్తిస్తుంది.

"కలర్ టి.వి." గుర్తు చేస్తున్నట్లుగా మూర్ఖత్వం.

"పన్నెండు వేలు." వివేకం యొక్క అమాయకపు కంఠం. "మనం దాచగలిగిందిప్పటికి నాలుగు వేలే."

"తమరేలోకంలో వుంటున్నారు?" మూర్ఖత్వపు హేళన.

"మీతోపాటే" శాంతంగా వివేకం.

"నాకు సందేహంగా వుంది. తమొక చోటా, తలొక చోటలా తమరు ఇహలోకంలో వుండడం లేదేమో అని."

"అదేమిటీ?" గతుక్కుమంది వివేకం.

"అటు వింటే సరి." కిటికీ తలుపులు తెరిచింది మూర్ఖత్వం.

బయటనుంచి రిక్షామైకు లోంచి మాటల సముద్రపు హోరు.

"మీరు కోరే ఏ వస్తువయినా సరే, మూడో వంతు ధరకే. మారుతీ కారయినా, మామిడికాయ తాండ్రయినా కేవలం మూడో వంతు ధరలో. మంచి తరుణం — మించిన దొరకదు త్వరపడండి. ఈ సువర్ణావకాశం కొద్దికాలం మాత్రమే. మావద్ద బ్లాక్ అండ్ వైట్, కలర్ టి.వి.లు, రిఫ్రిజిరేటర్లు, ప్రెషర్ కుక్కర్లు, మోపెడ్‌లు, గ్రయిండర్లు అన్నీ లభిస్తాయి. వస్తువు ధరలో మూడో వంతు ఇలా చెల్లించడమూ, వస్తువుని అలా తీసుకెళ్లిపోడమూ, పన్నెండు వేల కలర్ టి.వి. — కేవలం నాలుగు వేలకి మాత్రమే. మీ వూరి వారెందరలో లాభము పొందారు. మీరూ పొందండి — ఈ రోజే. మెయిన్ రోడ్‌లో కల మా అష్టపది ఎంటర్‌ప్రయిసెస్‌కి విచ్చేయండి." కిటికీ మూసేసి వివేకం వేపు వెక్కిరింతగా చూసింది మూర్ఖత్వం.

"ఈ హోరయితే నా చెవిలోనూ పడుతూనే ఉంది. ఇలాటి స్కీములు మన వూరికి కొత్తకానీ, వీటి లీలలెప్పటినుంచో జగద్విదితమే. ఇవి వొట్టి మోసం, దగా."

"ఎదురింటి వాళ్లు రెండు వేలిచ్చి మోపెడ్ తెచ్చుకున్నారు. పక్కింటి వాళ్లు నాలుగు వందలిచ్చి పచ్చళ్ల మిషన్ వెంటబెట్టుకొచ్చారు. నేనేమీ అంత తెలివి తక్కువేమీకాను. పది రోజులపాటు మంచీ — చెడూ, ఆనూపానూ చూశాకే వారం కిందటి నాలుగు వేలు కట్టాను కలర్ టి.వి.కి."

"అయ్యో! అప్పుడే డబ్బు చేజారిపోయిందా? నాతో మాట మాత్రంగా అయినా అనుంటే...."

"వొద్దు అనడానికేగా? తమరి దృష్టిలో నాదొట్టి అవివేకం. అందుకే చెప్పలేదు—"

"సరే... మరి కలర్ టి.వి. ఏది?"

"పది రోజుల్లో ఇస్తానన్నాడు."

"వస్తువివ్వకుండా డబ్బిచ్చేస్తే..." గొణిగింది వివేకం.

"అందరూ అలాగే ఇచ్చారు. అక్కడెంత జనమో చూస్తే తెలుస్తుంది. పాపం, కంపెనీవాళ్ళు మాత్రం ఏం చెయ్యగలరు? గోడౌన్‌లో సరుకున్నంత వరకూ వెంటనే ఇచ్చారు. మిగిలినవాళ్లకి తరువాత తెప్పించి ఇస్తున్నారు. ఊరు ఊరంతా అక్కడే. ఔను, ఖరీదైన వస్తువు చవకగా వొస్తూంటే ఎవరికి చేదు? ఎక్కడో వుంటారు తమలాగ మీనమేషాలు లెక్కిస్తూ మహదవకాశం చేజార్చుకునేవాళ్లు." చురక వేసింది మూర్ఖత్వం.

మౌనం దాల్చింది వివేకం. సహజంగానే వివేకం ఎప్పుడూ కనకంలా మోగకుండానే మిగులు తూంటుంది.

"ఈ చీటి పట్టుకుని వెళ్లి కలర్ టి.వి. పట్టుకు రావాలి. ఇవాళే ఇస్తాడు."

"డబ్బు కట్టినవాళ్లే వెళ్తే మంచిదేమో."

"సరే" రిక్షాలో బయలుదేరి వెళ్లిన మూర్ఖత్వం అరగంట తిరక్కుండానే — గోడకి కొట్టిన బంతిలా తిరిగొచ్చింది.

"ఆ కంపెనీ లేదు. ఔనా?" జాలిగా... సానుభూతిగా అడిగింది వివేకం.

"ఔను. బోర్డు కూడా లేదు. రాత్రికి రాత్రే ఎత్తేసినట్లుంది."

"ఇలాటి కంపెనీల కథ ముగింపు ఇంతే. కష్టపడి దాచుకున్న నాలుగు వేలూ అష్టపదార్పణం!" బోధగా ధ్వనించింది వివేకం గొంతు.

"పోయిన మొగుడు పోయాడు కానీ పొన్న కాయలాటి గుండొచ్చిందన్నట్లు — ఈ అష్టపది ఓ పాఠం నేర్పింది." ఓటమి వొప్పుకోలేని బలహీనత మూర్ఖత్వంలో.

"ఏమిటి?" కుతూహలంగా చూసింది వివేకం. అంతటితోనయినా మూర్ఖత్వం బాగుపడితే అంతే చాలన్నట్లు.

కచ్చితమయిన కంఠంతో అది మూర్ఖత్వం. "ఇలాటి స్కీముల్లో వస్తువులు కొనదలుచుకుంటే — వారం రోజులు ఆగకుండా మొదటి రోజునే, మొదటిగానే కొనుక్కోవాలి."

ఆ పాఠం వింటూనే ధమ్మని పడిపోయింది వివేకం.

పాఠక మహాశయులారా! మళ్లీ గుర్తు చేస్తున్నాను. గుణాలకి లింగభేదముండదు. వివేకం కానీ మూర్ఖత్వం కానీ స్త్రీ అయినా కావొచ్చు, పురుషుడయినా కావొచ్చు. కనుక నాకు పక్షపాత బుద్ధి అంటగట్టకండి. వివేకాన్ని పురుషుడనుకున్నా స్త్రీ అనుకున్నా మీ ఇష్టం అలాగే మూర్ఖత్వాన్నీను. •